క్లుప్తంగా

స్కూలు బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలి



డీటీసీ సురేష్‌కు మొక్క అందజేస్తున్న అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో మోటారు వాహన చట్టం అమలు చేయాలని, విద్యార్థులు ప్రయాణించే స్కూలు, కాలేజీ బస్సులు, ఆటోల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు కోరారు. ఈ మేరకు జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్‌ను మంగళవారం ఆయన కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరావు మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులకు మోటారు వాహన చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. పండగల సీజన్‌లో ప్రైవేటు రవాణా ఏజెంట్లు అధిక ధరలు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని కోరారు.

రక్తదాన దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు రాజేంద్ర నగర్ సచివాలయం పరిధిలోని ప్రజలకు రక్తదాన ప్రాధాన్యతను, రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ వీబీటీ సుందరి, సభ్యులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ పరిశీలన



ఈఎస్ఐ ఆస్పత్రిని సందర్శించిన సోము వీర్రాజు

కంబాలచెరువు: కేంద్ర ప్రభుత్వ నిధులతో పేపర్ మిల్లు రోడ్డులో నిర్మిస్తున్న ఈఎస్ఐ హాస్పిటల్‌ను, ప్రస్తుతం రోగులకు ఓపీ సేవలందిస్తున్న ఆస్పత్రిని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు మంగళవారం సందర్శించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఈ హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి, కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

కంబాలచెరువు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం గోదావరి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్మూర్తి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున విద్యార్థుల సేవను అభినందించారు.

సచివాలయం సెక్రటరీకి పీహెచ్‌డీ



కర్రి శ్రీనును సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ సచివాలయం–2లో సెక్రటరీ (గ్రేడ్–6)గా విధులు నిర్వర్తిస్తున్న కర్రి శ్రీనుకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ లభించింది. ఎఫిసిఎంట్ టాస్క్ షెడ్యూలింగ్ ఇన్‌క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్మెంట్ అనే అంశంపై థీసిస్ సమర్పించారు. ఈ మేరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. గుంటూరులోని ఆర్‌వీఆర్అండ్ జేసీ కాలేజ్ ఇంజినీరింగ్ సీఎస్ఈ హెడ్అండ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీలత పర్యవేక్షణలో దీన్ని పూర్తి చేశారు. కాగా.. పీహెచ్‌డీ పొందిన కర్రి శ్రీనును మంగళవారం సచివాలయ ఉద్యోగులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

సినిమాలు

శ్యామల	దేవర
సూర్యమినీ	సత్యం సుందరం
సూర్యప్యాలెస్	దేవర
శివజ్యోతి	కళింగ
స్వామి	జోకర్
అశోక	దేవర
రాజా	దేవర
ఊర్వశి	సత్యం సుందరం
మేనక	మత్తు వదలరా–2
రంభ	35చిన్నకథకాదు
కుమారి	దేవర
అప్సర	దేవర
నామవరం	
వీఎస్ మహల్	దేవర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	దేవర
కడియం	
వెంకటసూర్య	దేవర

దారులు ఇలా.. ప్రయాణమెలా..

- అనుసంధాన రోడ్లకు మోక్షమెప్పుడో..
- ఎస్‌వీజీ మార్కెట్ రోడ్డుకు కోర్టు అడ్డంకులు
- వీఎల్ పురం రహదారిపై నిర్లక్ష్యం



హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌వీజీ మార్కెట్‌కు వెళ్లే రహదారి



అధ్వానంగా మారిన వీఎల్ పురం వెళ్లే రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండలంలోని గ్రామాల నుంచి రాజమహేంద్రవరం నగరంలోకి ప్రవేశించేందుకు హండ్రెడ్ ఫీట్ రోడ్డు నిర్మించారు. అయితే దానికి అనుసంధానంగా ఎస్‌వీజీ మార్కెట్, వీఎల్ పురం ప్రాంతాలకు వెళ్లేందుకు రహదారుల నిర్మాణం జరగకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌వీజీ మార్కెట్ రోడ్డు కోర్టు అడ్డంకులతో నిలిచిపోయింది. వీఎల్ పురం వైపుకు వెళ్లే రోడ్డు వేసేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు, హుకుంపేట, పిడింగొయ్యి ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వేల మంది ప్రతి రోజూ రాజమహేంద్రవరం నగరంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రజల సౌకర్యార్థం జాతీయ రహదారి నుంచి ఆవవాంబే కాలనీ వరకూ హండ్రెడ్ ఫీట్ రోడ్డును నిర్మించారు. ఆ సమయంలోనే ఆ రోడ్డుకు అనుసంధానంగా వీఎల్ పురం, ఎస్‌వీజీ మార్కెట్ వైపునకు వెళ్లేందుకు రహదారుల ఏర్పాటుకు అప్పటి కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు నిర్మాణానికి ఆటంకాలు

ఎస్‌వీజీ మార్కెట్ రోడ్డులో తమ భూమికి సంబంధించి కొందరు స్థల యజమానులు నగరపాలకసంస్థ అధికారులు టీడీఆర్‌లు ఇవ్వలేదని కోర్టును ఆశ్రయించారు. దీంతో రోడ్డు నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ముంపు సమస్య ఉందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నగరపాలక సంస్థ అధికారులు టీడీఆర్‌లు ఇస్తామని డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరిగింది. కానీ సదరు స్థల యజమానులకు ఎటువంటి టీడీఆర్‌లు ఇవ్వలేదు. దీంతో వారు టీడీఆర్‌లు ఇస్తే తప్ప రోడ్డు నిర్మాణం చేపట్టనివ్వవద్దని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రోడ్డు నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం ఆ రోడ్డులో వర్షం వస్తే చాలు వాహన చోదకులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

వీఎల్ పురం రోడ్డులో నరకమే..

హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి వీఎల్ పురానికి వెళ్లే రోడ్డు చిన్న పుంతలా ఉంది. గోతులమయంగా మారిన ఆ రోడ్డులో రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో పగలు సమయంలోనే చాలా జాగ్రత్తగా వెళ్లాలి. ఇక రాత్రి సమయంలో ప్రయాణం నరకప్రాయమే.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



దేవీచౌక్‌లో దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: దసరా సంబరాలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. దేవీచౌక్‌లో జరుగుతున్న దసరా ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవీనవరాత్రులను పురస్కరించుకుని ఎక్కడా అవాంఛనీయ సంఘటన జరగకుండా, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా రికార్డింగ్ డ్యాన్సులు, అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తే ఆర్గనైజర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మూడో పట్టణ సీఐ వి.అప్పారావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాల శౌరి ఉన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



దీక్షలో పాల్గొన్న విద్యార్థి, యువజన సంఘాల సభ్యులు

కంబాలచెరువు: స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లో మంగళవారం విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్ష జరిగింది. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగిన ఈ దీక్షలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు టి.అరుణ్ పూల దండలు వేసి ఈ దీక్షను ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, డీవైఎఫ్ ఐ నాయకుడు వి.రాంబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. విశాఖ ఉక్కుకి సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాయకులు విశాఖ ఉక్కు కోసం కనీసం ప్రశ్నించటం లేదని చెప్పారు. ప్రైవేటీకరణ ఆపడానికి ప్రయత్నం చేయకపోవడం దారుణమన్నారు. దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఎస్‌యూఐ నాయకుడు తారకేశ్, ఎల్ఐసీ అధ్యక్ష, కార్యదర్శులు కోదండరావు, సీఐటీయూ నాయకులు బి.పవన్, బి.పూర్ణిమ రాజు, కేఎస్‌వీ రామచంద్రరావు, ఎస్.వెంకటేశ్వరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబీ రాణి, ఎం.గోవర్ధన్ మద్దతు తెలిపారు.

వృద్ధులు కాదు .. అభివృద్ధికి పునాదులు



ఆర్ట్స్ కళాశాలలో వృద్ధులను సత్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సోషల్ వర్క్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల ఇబ్బందులకు పరిష్కార మార్గాలను కనుగొనాలని యువతకు సూచించారు. వృద్ధులు తమ మన అభివృద్ధికి పునాదులన్నారు. వారి హక్కులను గౌరవించాలని, వారికి తోడుగా నిలవాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ వృద్ధుల అనుభవాలను మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులను సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రాణి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం కళాశాలలో నిర్వహించటం మొదటిసారి అన్నారు. అధ్యాపకులు కె.కుసుమ కుమారి, శివాజీ, సత్యం సూర్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు ఫిజియోథెరపీ సేవలు

రాజమహేంద్రవరం రూరల్: వృద్ధులకు బీపీ, షుగర్, ఈసీజీ చెకప్‌తో పాటు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఏపీడీమాలజిస్ట్ డాక్టర్ బి.సుధీర్‌బాబు, ఎస్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వివాదానికి కారణమైన ఫ్లెక్సీ తొలగింపు



శ్రీరంగపట్నం చెరువుగట్టుపై ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం చెరువుగట్టుపై వివాదానికి కారణమైన ఫ్లెక్సీ ఫ్రేమ్‌ను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఆ ఫ్రేమ్‌పై కూటమికి చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వివాదానికి కారణమైన విషయం తెలిసిందే. కాగా.. ఈ ఘటనలో దాడికి గురైన వారిపైనే కేసులు పెట్టడాన్ని పార్టీ నాయకులు కొయిడాల నానాజీ, తనకాల ప్రసాద్, సూరిశెట్టి కుటుంబరావు, దాడి వీరబాబు తప్పుపట్టారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దాడికి గురైన బాధితులందరూ పోలీసు స్టేషన్‌వద్ద ఉండగా పంచాయతీ అధికారులు వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్రేమ్‌ను మాత్రమే తొలగించడమేమిటని ప్రశ్నించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడాన్ని తప్పుపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించామని పంచాయతీ అధికారుల బదులు చెప్పారని, వాటిని చూపించమంటే కంగుతిన్నారన్నారు. దీంతో మిగిలిన సగభాగాన్ని అలాగే వదిలేశారన్నారు. అదే చెరువుగట్టుపై ఉన్న ఇతర ఫ్లెక్సీలను కూడా తొలగించాలని పంచాయతీ అధికారులను డిమాండ్ చేశామన్నారు. సోమవారం జరిగిన దాడిలో గాయపడిన తమపై పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమన్నారు. బాధితులమైన తాము కేవలం ముగ్గురిపై మాత్రమే ఫిర్యాదు చేశామన్నారు. కానీ కూటమి నాయకుల ప్రోద్బలంతో మరో వర్గానికి చెందిన తమ వర్గంలోని ఏడుగురిపైఐ ఫిర్యాదు చేశారన్నారు.

ఉత్సాహంగా చెకుముకి మండల పోటీలు



బహుమతులు సాధించిన విద్యార్థులతో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు



కడియంలో ప్రథమస్థానం సాధించిన షిర్డీసాయి, వేమగిరితోట స్కూలు విద్యార్థులు

కంబాలచెరువు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి మండల స్థాయి పరీక్షలను గౌతమీ స్కూల్ శ్రీరామ్ నగర్ బ్రాంచ్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. దానిలో భాగంగా ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి విజేతలకు అక్టోబర్ 27వ తేదీన జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాలు చేయడం ద్వారా లోతైన పరిజ్ఞానం ఏర్పడుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతీ ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కంటిపూడి రామారావు మున్సిపల్ హైస్కూల్ (ప్రథమ), లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (ద్వితీయ), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (తృతీయ), చున్నీలాల్‌జాజు మున్సిపల్ హైస్కూల్ (కన్సోలేషన్) ప్రతిభ చూపాయి. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శ్రీరాములు, సీహెచ్ నిశ్చల్, బి.గోపాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు

కడియం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం లెంట్ టెస్టు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ ప్రశ్నాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చెకుముకి పోటీల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం రెట్టింపు అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో వేమగిరి తోట, దుళ్ల, కడియం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ప్రైవేట్ పాఠశాల విభాగంలో షిర్డీసాయి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి వై.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గొల్లపల్లి సత్యనారాయణ నిర్వహించగా, ఉపాధ్యాయులు బి సువర్ణ వేణి, సీహెచ్ వీవీఎస్ఎన్ శాస్త్రి, నాగమణి, పద్మశ్రీ పర్యవేక్షించారు.

జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బర్రే ఆనంద్ కుమార్

సీటీఆర్ఐ: ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీలో విషయం కలిపి, చేపలు చనిపోయేలా చేసిన జనసేన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన జనసేన నాయకులు.. ఎస్సీలకు చెందిన చెరువులలో చేపలను గత కొంతకాలంగా దొంగతనం చేయిస్తున్నారన్నారు. వారం రోజుల క్రితం ఎస్సీ ఫిషర్‌మెంట్ సొసైటీ సభ్యులు పహారా కాసి, రెడ్ హ్యాండెడ్‌గా దొంగలను పట్టుకున్నారన్నారు. దీంతో అక్కడికి వచ్చిన జనసేన పార్టీ నాయకులు, పోలీసులకు వారిని అప్పగించనివ్వకుండా, బలవంతంగా విడిపించుకు పోయారన్నారు. దీనిపై కోరుకొండ పోలీస్ స్టేషన్, జిల్లా ఎస్పీ కార్యాలయంలోను ఆధారాలతో సహా ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి కేసు నమోదు చేశారన్నారు. దీంతో జనసేన నాయకులు మరో కుట్రకు తెరతీశారన్నారు. ఎస్సీ సొసైటీలకు చెందిన చెరువులో విషం కలిపి చేపలు చనిపోయేలా చేశారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి చెరువులో చనిపోయి పైకి తేలుతున్న చేపల ఫొటోలు తీసుకొని వెళ్లిపోయారే తప్ప, నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ఆ అధికారులపై చర్యలు చేపట్టరా!

కడియం: కడియపులంకలో పరిధిలో డ్వాక్రా సంఘాలకు సంబంధించిన బ్యాంకు వాయిదాల చెల్లింపులో బాధ్యులైన వెలుగు అధికారులపై చర్యలు ఎందుకు చేపట్టడం లేదో తెలపాలని కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడియపులంక పంచాయతీ పరిధిలో ప్రస్తుతం మూడు గ్రూపులకు సంబంధించి సుమారు రూ.30 లక్షలను కడియపులంక డ్వాక్రా యానిమేటర్ గోల్‌మాల్ చేశారని డ్వాక్రా సభ్యులు చెబుతున్నారన్నారు. కడియపులంక, బుర్రిలంక వెంకాయమ్మపేటతో పాటు మండలంలోని డ్వాక్రా గ్రూపుల పుస్తకాలను పరిశీలిస్తే మరిన్ని అవకతవకలు బయటపడే అవకాశం ఉందన్నారు. దీనిపై రాజమహేంద్రవరంలో వెలుగు (డీఆర్డీఏ) పీడీకి గత నెల 5వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. కడియం పోలీస్ స్టేషన్, కడియం వెలుగు కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి తక్షణం దర్యాప్తు చేయాలని రాంజీ కోరారు. 20 నెలలుగా డ్వాక్రా సంఘాలు బ్యాంకులలో తీసుకున్న రుణాలు జమ చేయకపోయినా బ్యాంకు అధికారులు గానీ, వెలుగు అధికారులు గానీ ఆరా తీయకపోవడం వెనుక అనుమానాలు న్నాయన్నారు.

వృద్ధుడి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీనగర్‌కు చెందిన 68 ఏళ్ల ఏలూరి రమణారావు అదృశ్యమయ్యాడు. ఎలక్ట్రికల్ పనిచేసుకునే ఆయన ప్రస్తుతం కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. రమణారావు, అతడి భార్యకు చిన్న తగాదాలు జరిగినప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజులకు వచ్చేశారు. గత నెల 23వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటిలో ఫోన్ వదిలేసి రమణారావు వెళ్లిపోయారు. కానీ ఇప్పటి వరకూ తిరిగి రాలేదు. ఈ మేరకు అతడి మనవడు విష్ణుమహంతి సీతారామ్ మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా పోటీలకు కొంతమూరు విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రత్నకళ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో ఎం.ఆనంద్ కుమార్(9వ తరగతి), కె.కార్తికేయ (6వ తరగతి), కరిష్మా (6వ తరగతి), అండర్ 17 విభాగంలో ఎస్‌కే అజీస్ (9వ తరగతి), బి.శ్రీనివాస్ (10వ తరగతి) ప్రతిభ చూపారు. కాకినాడ స్పోర్ట్స్ అథారిటీలో సోమవారం ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్ టి.సుజాతను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రత్నకళ, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ టీటీ పోటీలకు..

ప్రకాశం నగర్: లడక్‌లోని లేహ్‌లో ఈ నెల 5 నుంచి 8 వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 నేషనల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ నుంచి నలుగురు క్రీడాకారులు అర్హత సాధించారు. ఈ విషయాన్ని కోచ్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో గత నెలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొన్న జి. నమన్ జైన్, బి.జోషిత్, ఎల్.సాకేత్ బాలుర విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికయారన్నారు. అకాడమీకు చెందిన మరో క్రీడాకారిణి జి.సిరిపావని కోల్‌కతాలో జరిగిన ఆల్ ఇండియా టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొని విజయం సాధించడం ద్వారా లడక్ లో జరిగే జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశాన్ని సాధించిందన్నారు. ఆ క్రీడాకారులను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు విశ్వనాథం భాస్కరరామ్ అభినందించారన్నారు.

పరిశోధనల్లోనూ పోటీతత్వం ఉండాలి

రాజానగరం: నేటి ఆధునిక సమాజంలో అన్నింటిలోనూ పోటీతత్వం పెరుగుతోందని, ఇదే క్రమంలో పరిశోధనల్లో కూడా పోటీతత్వాన్ని అలవర్చుకుని, నూతనావిష్కరణలో ముందడుగు వేయాలని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ మొదటి బ్యాచ్ అడ్మిషన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌డీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భావితరాలకు, సమాజానికి ప్రయోజనం చేకూర్చే విధంగా పరిశోధనలు ఉండాలని సూచించారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

రాజానగరం: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా మంచి దిగుబడులతోపాటు ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. మండలంలోని కానవరంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో గ్రామంలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. మండలంలో సాగు చేసిన వరి పంటకు అక్కడక్కడా బ్యాక్టీరియా ఆకుఎండు తెగులు ఆశించినట్టుగా గుర్తించామన్నారు. అధిక నత్రజనిని వాడటం, పొటాష్‌ని అసలు వాడకపోవడం, తెగులు సోకిన పొలాల నుంచి ఆరోగ్యవంతమైన పొలాలకు సాగునీరు ప్రవహించడం వల్ల ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. ఈ తెగులు ఆశించిన పొలంలో వెంటనే నత్రజని ఎరువుల వాడకాన్ని నిలిపివేయాలన్నారు. వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన విధంగా అంకురం దశలో పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరాకు 20 కిలోలు చొప్పున చల్లాలన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని మురుగునీటి కాలువల్లోకి రెండు, మూడు సార్లు తీసివేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ పాల్గొన్నారు.